48

# దొందూ - దొందే

అనగా అనగా ఒక ఊరిలో 'హరి' అనే వాడుండేవాడు.

తల్లిదండ్రులకు వాడు ఒక్కగానొక్క కొడుకు కావడంతో, వాళ్ళు వాడిని అతి గారాబంగా పెంచారు. దానికితోడు- హరి స్వతహాగా చిన్నప్పటి నుంచి బాగా తిండిపుష్టి ఉన్నవాడు. దాంతో... వాడు పరమ తిండిపోతయి ఏనుగు గున్నలా తయారయ్యాడు.

హరికి పెళ్ళీడు రావడంతో, వాడికి సంబంధాలు చూడసాగారు తల్లిదండ్రులు.

అయితే... వాడి తిండిపోతుతనం ఊరందరికీ తెలిసివుండడంతో అతనికి పిల్లనియ్యడానికి ఎవరూ ముందుకు రాలేదు. చివరికి ఎలాగైతేనేం.., 'మాలిని' అనే అమ్మాయితో హరికి వివాహం అయింది.

ఆమె కూడా రూపంలోకాని, తిండిపోతుతనంలోకాని హరికంటే నాలుగాకులు ఎక్కువేకాని, తక్కువ కాదు. ఆ జంటను చూసి అందరూ సమఉజ్జీలని నవ్వుకున్నారు.

మాలిని అత్తవారింటికి కాపురానికి వచ్చింది. కొడుకు పెళ్ళి కాగానే తల్లిదండ్రులు తీర్థయాత్రలకి వెళ్లిపోయారు.

మాలిని వంటచేసి భర్తని భోజనానికి రమ్మని పిలిచింది. వండిన వంటకాలు తనకి పెట్టకుండా తినేస్తుందేమోనన్న అనుమానంతో హరి పీట మీద కూర్చుని, ఓ కంట ఆమెని కనిపెట్టసాగాడు.

మాలిని భర్తకు రొట్టె వడ్డించింది. అతడు ఆ రొట్టెను విరుస్తూ "ఏం... దీనికి నెయ్యి ఇంత తక్కువ రాశావు?" అన్నాడు కోపంగా.

"గిన్నెలో నెయ్యి లేదు. ఏం చేయమంటారు?" అంటూ గిన్నెని వంచి చూపించింది మాలిని. చలికి నెయ్యి గడ్డకట్టి ఉండడంతో నెయ్యి అందులోంచి పడలేదు.



ఈ కిటుకు కనిపెట్టాడు హరి.

"వట్టి రొట్టెను తినడం ఎలా? పెరట్లోకి పోయి నాలుగు పచ్చి మిరపకాయలు, కాసిని టొమాటోలు కోసుకురా. కొంచెం నూరి పచ్చడి చేద్దువుగాని.., నంచుకు తింటాను" అన్నాడు హరి.

ఆమె దొడ్లోకి వెళ్లగానే నేతిగిన్నెను పొయ్యి మీద పెట్టి నేతిని కరిగించి మొత్తం తన కంచంలో గుమ్మరించుకున్నాడు.

మాలిని దొడ్లోంచే ఇదంతా ఓ కంట కనిపెట్టసాగింది.

చకచకా లోపలకి వచ్చి "అత్తవారింట్లో మొదటిసారి భార్యాభర్తలిద్దరూ ఒకే కంచంలో తినాలని అంటారు" అంటూ భర్త సమాధానం కోసం ఎదురుచూడకుండా తానూ ప్రక్కనే పీట వేసుకుని, భర్త తోపాటు తనూ కంచంలోని రొట్టె ముక్కలను బొక్కడం మొదలు పెట్టింది.

రొట్టెలయిన తర్వాత ఇంకనెయ్యి మిగిలింది.

హరి కంచం ఎత్తి నేతిని జుర్రసాగాడు. తానూ తాగాలని మాలిని కంచాన్ని బలంగా లాగింది. ఈ పెనుగులాటలో కంచం క్రిందపడి నెయ్యంతా నేలపాలయింది.

దాంతో హరి పట్టరాని కోపంతో మాలినిని ఎడాపెడా కొట్టడం మొదలు పెట్టాడు. దాంతో ఆమె ఇల్లదిరిపోయేట్టు ఏడవసాగింది. ఈ గోలకి ఇరుగుపొరుగు వారొచ్చి ఇద్దర్నీ విడిపించారు.

"ఈ తిండిపోతు మొగుడు నాకక్కరలేదు" అంటూ మాలిని పుట్టింటికి వెళ్లిపోయింది.

"ఈ తిండిపోతు పెళ్లాం నాకు వద్దే వద్దు" అన్నాడు హరి.

వారిని చూసి నలుగురూ "దొందూ దొందే ... గంతకు తగ్గ బొంతలు!" అని నవ్వుకున్నారు.

★★★

